క్లుప్తంగా

ముగిసిన పూజలు, హోమాలు



హోమ గుండానికి పూర్ణాహుతి ద్రవ్యాలు సమర్పిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సుంకులమ్మ వీధిలోని సుంకులాపరమేశ్వరి దేవి ఆలయం, అనుబంధంగా నూతనంగా నిర్మించిన పూజా మండపంలో ఆదివారం చివరి రోజు పూజలు, హోమాలు, పూర్ణాహుతితో ముగిశాయి. వేదపండితులు ప్రవీణ్, వేణుగోపాల స్వామి, శివశర్మ బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, శివుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గణపతి, లక్ష్మీ, వాస్తు, రక్ష, నవగ్రహ హోమాలు చేపట్టి పూర్ణాహుతి గావించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ రూ.30లక్షలతో దేవాలయంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

ఇఫ్తార్ ఏర్పాటు



చాగలమర్రిలోని ఖిలా మస్జిద్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

చాగలమర్రి: పట్టణంలోని కోటగడ్డ వీధికి చెందిన యువకులు ఖిలా మస్జిద్‌లో రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలోనున్న వారికి ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సుమారు 300 మంది దీక్షాపరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఇమాం మౌలానా అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజు నిర్వహించారు. ఈ మాసం పవిత్ర కార్యక్రమాలు చేపడితే అల్లా మంచి ఫలితాలను ఇస్తారని మౌల్వీ అబ్దుల్ సలాం వివరించారు.


స్పాట్ సొమ్ము వెంటనే చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి స్పాట్‌కు సంబంధించి టీఏ, డీఏ, రెమ్యునరేషన్ మొత్తాన్ని స్పాట్ అయిన వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి మూల్యాంకన విధులకు దీర్ఘకాలిక వ్యాధులు, 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రామిరెడ్డి, నరసింహరావు, చంద్రశేఖర్, రంగారెడ్డి, పురుషోత్తమరెడ్డి, చంద్రుడు, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఉయ్యాలవాడ : వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణం నుంచి కోవెలకుంట్లకు ఇసుకతో తరలివెళ్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని పుచ్చకాయలపల్లె మెట్ట వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులురెడ్డి ఆదివారం తెలిపారు. జమ్మలమడుగు పట్టణానికి చెందిన పన్నెగట్ల గౌసుబాషా రాయల్టీ, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ లేకుండా అక్రమంగా తరలిస్తుండడంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కుమారస్వామికి షష్ఠి పూజలు



ప్రత్యేక అలంకరణలో కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్ఠిని పరస్కరించుకుని లోకకల్యాణార్థం ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

సంక్షేమం జోరు.. అభివృద్ధి హోరు

- ప్రగతి పథంలో చిత్రేనిపల్లె
- డీబీటీ, నాన్ డీబీటీ కింద గ్రామస్తులకు రూ.21.55 కోట్ల లబ్ధి
- ఆర్థికంగా మెరుగు పడిన కుటుంబాలు
- సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో తప్పిన కష్టాలు
- నాడు–నేడుతో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు
- హెల్త్ సెంటర్‌తో అందుబాటులో వైద్య సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

చిత్రేనిపల్లెతో పాటు మజరా అయిన ముకుందాపురం, హరినగరం, సుగాలి తండా గ్రామాలు ఐదేళ్ల క్రితం వరకు సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోయాయి. తమను ఒడ్డుకు చేర్చాలని గతంలో పాలకులు, ప్రజా ప్రతినిధులను వేడుకున్నా వారి చెవికెక్కలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు వారికి మంచి రోజులొచ్చాయి. దాదాపు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు, సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్, గోదాము, పాఠశాలలో వసతులు తదితర వాటితో గ్రామంలో అభివృద్ధి వెలుగులు ప్రసరించాయి.



చిత్రేనిపల్లె గ్రామ సచివాలయం



వైద్య సేవలు అందిస్తున్న హెల్త్ సెంటర్

రుద్రవరం: చిత్రేనిపల్లె పంచాయతీలో గతంలో ప్రధాన,అంతర్గత రోడ్లు,మురుగు కాల్వలు లేక అస్తవ్యస్తంగా ఉండేది. మురుగు నీరు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లేది. దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాలతో మంచం పట్టేవారు. అయినా నాటి ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడలేదు. తమ బతుకులింతేనని గ్రామస్తులు సర్దుకుపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి సమస్యల పరిష్కారం మొదలైంది. మూడేళ్లలో దాదాపు వసతులన్నీ సమకూరాయి. ఇక ప్రభుత్వ కార్యాలయాలు, గోదాము, ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి రావడంతో వారికి పాలన మరింత చేరువైంది. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడంతో ఆర్థికంగా మెరుగుపడ్డాయి. చిత్రేనిపల్లె పంచాయతీతో పాటు మజరా గ్రామాలైన ముకుందాపురం,చెంచుగూడేలైన హరినగరం,సుగాలి తండాల్లో సైతం అభివృద్ధి పనులు చక చకా సాగాయి. నాడు సమస్యలతో అల్లాడిన గ్రామాలకు నేడు ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం రూ.21.55 కోట్ల మేర లబ్ధి చేకూరింది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధి పనులు..

- చిత్రేనిపల్లె, ముకుందాపురం గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ నిధులు రూ.66లక్షలు వెచ్చించి సీసీరోడ్డు, ఇరువైపులా మురుగు కాల్వ నిర్మించడంతో గ్రామంలో మురుగు సమస్యకు పరిష్కారం లభించింది.
- చిత్రేనిపల్లె నల్లమల అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉంది. దీంతో రోగాలతో అలమటించేవారు. అందుబాటులో వైద్యం లేక పట్టణాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చిత్రేనిపల్లెలో హెల్త్ సెంటర్ నిర్మించి ఇళ్ల వద్దే వైద్యం అందేలా చేశారు.
- సచివాలయ,వలంటీర్ వ్యవస్థ వచ్చాక మండల కేంద్రానికి వెళ్లనవసరం లేకుండానే అవసరమైన పనులన్నీ గ్రామంలోనే అందుతున్నాయి. ఇక ధ్రువ పత్రాలు సకాలంలో అందుతుండటంతో వ్యయప్రయాసలు తగ్గాయి.
- రైతు భరోసా కేంద్రంతో స్థానికంగానే నాణ్యమైన ఎరువులు,విత్తనాలు అందుతున్నాయి.
- పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాము నిర్మించారు.
- మూడు పాఠశాలలను రెండో విడత నాడు–నేడు కింద విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలన్నీ సమకూర్చారు.
- గ్రామాల్లో సీసీరోడ్లు, మట్టి రోడ్లు వేశారు.

మంజూరైన నిధులు..

గ్రామ సచివాలయం,రైతు భరోసా,వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలకు	రూ.79.30లక్షలు
ఎమ్మెల్యే నిధులు	రూ.20.00లక్షలు
నాడు–నేడు(మూడు పాఠశాలలు)	రూ.58.00లక్షలు
ఉపాధి నిధులు	రూ.35.00లక్షలు
జీజీఎంపీ	రూ.20.00లక్షలు
పంచాయతీ నిధులు	రూ.15.00లక్షలు
మండలనిధులు	రూ.6.00లక్షలు
ఆర్‌అండ్‌బీనిధులు	రూ.66.00లక్షలు
గోదాము నిర్మాణానికి	రూ.40.00లక్షలు
సంక్షేమ పథకాల ద్వారా (డీబీటీ)	రూ.12.73కోట్లు
నాన్ డీబీటీ లబ్ధి..	రూ. 5.43కోట్లు



రైతుల ప్రయోజనార్థం నిర్మించిన గోదాము



ముకుందాపురంలో వేసిన సీసీరోడ్డు

మరోసారి జగనన్నే రావాలి



జగనన్న ముఖ్యమంత్రి కావడంతో మారుమూల గ్రామాలు కూడా అభివృద్ధి బాట పట్టాయి. గత ప్రభుత్వ హయాంలో సమస్యలతో సతమతమయ్యే వాళ్లం. మా గ్రామం మారుమూల ప్రాంతంలో ఉండటంతో ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు.తమకు కావాల్సిన సదుపాయాలన్నీ వలంటీర్లు, గ్రామ సచివాలయాల ద్వారా క్షణాల్లో అందుతున్నాయి. ఈ సౌకర్యాలన్నీ ఇలాగే కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలి.

– గుండా వెంకట నరసింహ్మయ్య, చిత్రేనిపల్లె

పాలనలో ఎంతో తేడా ఉంది



టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు ఎంతో తేడా ఉంది. గతంలో ఏ పని కావాలన్న జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. అలాగే గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్తే వేగంగా స్పందించి నిధులు విడుదల చేయించి పనులు త్వరగా పూర్తయ్యేలా చేసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నారు. గతంలో ఇంత వేగంగా సమస్యలు పరిష్కరించే నాయకులు లేరు. – మాధవ చిత్రేనిపల్లె

బడిలో వసతులు కల్పించారు



టీడీపీ హయంలో మా గూడెంలోని బడిలో సౌకర్యాలు లేక పిల్లలు బడికి వెళ్లే వారే కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నాడు –నేడు కింద పనులు చేపట్టి పాఠశాలలో వసతులు కల్పించడమే కాకుండా అందంగా తీర్చిదిద్దారు. నేల మీద కూర్చొని చదువుకునే రోజులు పోయాయి. బెంచీలు వేయడంతో పాటు ఆధునిక విధానంలో పాఠాలు బోధిస్తున్నారు. ముఖ్యంగా తల్లులకు అమ్మఒడి కింద నగదు అందిస్తుండటం, బడి బాగుండటంతో పిల్లలంతా మళ్లీ బడికి పరుగులు తీస్తున్నారు. మా గ్రామంలో సీసీరోడ్లు, మట్టి రోడ్లు వేయించారు. – నాగముని,హరినగరం

బాబూ.. నిన్ను కాపాడింది డ్రైవర్లే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులను ప్రకటించడంపై చంద్రబాబు చౌకబారుగా మాట్లాడారని, బాంబ్ బ్లాస్ట్ సమయంలో నిన్ను కాపాడింది డ్రైవర్లే అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డ్రైవర్ల అసోసియేషన్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీ పాలనలో ఉద్యోగాలు రాకనే నిజాయితీగా డ్రైవర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. ఆయనకు చట్టసభకు వెళ్లేందుకు అవకాశమివ్వడంపై నీకెందుకు అంత అసూయ అని ప్రశ్నించారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతించినా చంద్రబాబుకు మింగుడు పడలేదని, ఎట్టకేలకు వారికి పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. డ్రైవర్ల అగచాట్లు మీకు తెలుసా అని డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు కిశోర్, శ్రీనివాస రెడ్డి, రాము, గిరి ప్రశ్నించారు. ఇప్పటికైనా హేళనగా మాట్లాడటం మానాలని లేకపోతే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సుధాకర్‌రెడ్డి, కూలూరు నరసింహారెడ్డి, గంగుల రామిరెడ్డి పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు

మహానంది: ఎన్నికల నేపథ్యంలో ప్రతి చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మహానంది మండలం గాజులపల్లె సమీపంలోని ఆంజనేయపురం వద్ద ఉన్న చెక్‌పోస్టు వద్ద ఆదివారం వాహనాల తనిఖీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఏ మాత్రం అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే అప్రమత్తమవ్వాలన్నారు. సిబ్బంది ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదన్నారు. సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులపై దాడులు సరికాదు



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఆర్యవైశ్యులపై ఆర్థిక దాడులను ఖండిస్తున్నామని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు పేర్కొన్నారు. ఆదివారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వివిధ వ్యాపార సంఘాల నాయకులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎన్నికల అధికారులు వ్యాపారాలు చేసే ఆర్యవైశ్యులే లక్ష్యంగా ఉదయం నుంచి రాత్రి వరకు వ్యాపార లావాదేవీలు నిర్వహించిన సొమ్మును స్వాధీనం చేసుకోవడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు సూచించిన వారినే టార్గెట్ చేసి పట్టుకోవడం దారుణమన్నారు. వ్యాపారాలు పూర్తయిన తర్వాత డబ్బులు ఇంటికి తీసుకొని వెళ్లే సమయంలో అధికారులు నిఘా ఉంచి పట్టుకుంటున్నారన్నారు. ఇలాగైతే తాము వ్యాపారాలు ఎలా నిర్వహించాలని ప్రశ్నించాలన్నారు. కండే శ్యాంసుందర్ లాల్, బింగుమళ్ల శ్యాం, నెరవాటి సత్యనారాయణ, విజయ్‌కుమార్, కొెట్టి చంద్రశేఖర్, కృష్ణమూర్తి, బైసాని రామకృష్ణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో సోదరభావం



మార్కెట్‌లో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ప్రజల్లో సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక గాంధీచౌక్‌లోని చౌక్ మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మసీదు నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. అలాగే స్థానిక కూరగాయల మార్కెట్‌లో మార్కెట్ అధ్యక్షుడు కలాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నాయకులు జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు.

పుణ్యకార్యం..



చిలుకలూరులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న గంగుల కుటుంబ సభ్యులు

రుద్రవరం: రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష విరమించే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యమని జలవనరుల శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిలుకలూరులో ఆదివారం గ్రామానికి చెందిన ఆకుల హుసేన్ ఏర్పాటు చేసిన విందులో పుట్లాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, నాయకులు గంగుల సుదర్శన్‌రెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గోపిరెడ్డి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లపై టీడీపీ దుష్ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు మొదటి నుంచి అక్కసుతోనే ఉన్నారని, ఎన్నికల సమయంలో వారిపై లేనిపోని నిందలు మోపి దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు అండ్ గ్యాంగ్‌కు వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవ నచ్చడం లేదన్నారు. ఇలా ప్రజలకు అన్ని రకాలుగా సేవలందిస్తున్న వ్యవస్థతో తమను జనం మరిచిపోతారని, వారిని ఎలాగైనా అడ్డుకోవాలని తమ అక్కసును వెళ్లగక్కుతున్నారన్నారు. చివరకు పేదలకు పింఛన్ల పంపిణీ చేయకుండా అడ్డుకుని తన వక్రబుద్ధిని చాటారని మండిపడ్డారు. అవ్వాతాతలు, దివ్యాంగులకు ఇబ్బందిని కలిగించే పింఛన్ల పంపిణీపై ఈసీ పునరాలోచించాలని కోరారు.

- శింగనమల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామాంజనేయులపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన పేదల పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనమన్నారు. టిప్పర్ డ్రైవర్ ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు పనికిరారంటూ మాట్లాడిన చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేదలు, దళితుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడటం దుర్మార్గమన్నారు.
- పట్టణంలో వ్యాపారాలు ముగించుకుని ఇళ్లకు వెళ్తుండగా కోడ్ పేరుతో అధికారులు తనిఖీలు చేసి సొమ్ము స్వాధీనం చేసుకున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, వ్యాపారుల వద్ద ఉన్న రసీదులను పరిశీలించి సొమ్ము అందజేయాలని అధికారులను కోరామన్నారు. వ్యాపారులకు అండగా ఉంటామని ఆందోళన చెందవద్దన్నారు. లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పెద్దవంగలిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో భూమా కిశోర్‌రెడ్డి

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆళ్లగడ్డ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు మేడిగ సునీల్, అనిల్, బాలయ్య, విజయ్, సంపత్, కాంతురాజు, భాగ్యమ్మ, దేవక్క, పాములేటి, యు.సంపత్, రమేష్, ప్రశాంత్, బాబు, మద్దెల బాబు, ఇసాక్, నిర్మల, చిన్న బయ్యన్న, జకరయ్యతో పాటు 25 కుటుంబాలకు చెందిన 125 మంది మాజీ సర్పంచ్ పుల్లయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు అంబటి మహేశ్వరరెడ్డి, నందీశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, చెన్నారెడ్డి, గౌస్‌పీరా, జబ్బార్, అజాద్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘాభివృద్ధికి కృషి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

క్రీస్తు పునరుత్థానం మానవాళికి రక్షణ

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): శుభ శుక్రవారం తర్వాత వచ్చే పవిత్ర ఆదివారం క్రీస్తు ప్రభువు మరణాన్ని జయించి మృత్యుంజయుడై సజీవునిగా లేచిన సందర్భంగా సంతోషంతో క్రీస్తు పునరుత్థాన పండుగను నిర్వహించుకున్నారు. క్రీస్తు పునరుత్థానం మానవాళికి రక్షణ మార్గాన్ని చూపిందని, సమస్త మానవాళి పాపాల కొరకు రెండు వేల సంవత్సరాల క్రితం సిలువ మ్రానుపై బలియాగంగా మారిన ఏసు క్రీస్తు మూడవ దినమున తిరిగి సజీవుడయ్యాడని నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ రైట్ రెవరెండ్ ఐజక్ వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్–1, పరిశుద్ధమత్తయి, చిన్నచర్చి ఆలయంలో బిషప్ ఐజక్ వరప్రసాద్ దైవ సందేశమిచ్చారు. శనివారం ఆదివారం వేకువ జామున 3గంటలకు చర్చిల్లో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. రెవరెండ్ జోసఫ్‌బాబు, విజయ్‌కుమార్, ఇమ్మానియేల్ సందేశమిచ్చారు. కార్యక్రమంలో చిన్న చర్చి డీనరీ చైర్మన్ నందం ఐజక్, డానియేల్‌పురం పాస్టరేట్ చైర్మన్ రెవరెండ్ విక్టర్‌బాబు, టెక్కె పాస్టరేట్ చైర్మన్ సుమిత్రబాబు, జోయెల్ పాల్గొన్నారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.





పరిశుద్ధమత్తయి ఆలయంలో ఎమ్మెల్యే శిల్పారవిని ఆశీర్వదిస్తున్న బిషప్ ఐజక్ వరప్రసాద్, క్రిష్టిపాడులో శిలువ మోస్తూ రంగులు చల్లుకుంటున్న క్రైస్తవులు

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు పునరుత్థానం అయిన సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంగులు చల్లుకుని ఆనందోత్సాహాలు పంచుకున్నారు.

దొర్నిపాడు: క్రీస్తు తిరిగి జన్మించిన సందర్భంగా జరుపుకునే పునరుత్థానం(ఈస్టర్) పండుగను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వేకువ జాము నుంచే రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. నూతన దస్తులు ధరించి చర్చీలకు వెళ్లి స్తుతి గీతాలు ఆలపించి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

చాగలమర్రి: క్రీస్తు మరణం నుంచి తిరిగి లేచిన సందర్భంగా పునుత్థాన పండుగ నిర్వహించుకుంటున్నామని పాస్టర్ రెవ.ఆర్‌ఏఈ.సంజీవ్ రాజ్ అన్నారు. మండలంలో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముత్యాలపాడు గ్రామంలోని పురాతన ఎస్‌పీజీ చర్చిలో పాస్టర్ సంజీవ్ రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. చాగలమర్రిలోని పాత, కొత్త ఎస్సీ కాలనీల్లో యువతీ, యువకులు రంగులు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు.



ముత్యాలపాడు ఎస్‌పీజీ చర్చిలో ఈస్టర్ ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న పాస్టర్ రెవ.ఆర్‌ఏఈ.సంజీవ్ రాజ్

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శిలువ వేయబడిన ఏసు క్రీస్తు మృత్యుంజయుడై తిరిగి లేచిన సందర్భంగా ఆదివారం వేకువజామునే చర్చీలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యువకులు, చిన్నారులు రంగులు చల్లుకొని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో దైవసందేశం ఇస్తున్న డీనరీ చైర్మన్ రెవరెండ్ సునీల్ కుమార్



చాగలమర్రి కొత్త ఎస్సీ కాలనీలో రంగులు చల్లుకొని సంబరాలు చేసుకుంటున్న యువకులు

ఆళ్లగడ్డ: క్రీస్తు మానవాళిపై ప్రేమ, శాంతి, కరుణ చుపాడని డీనరీ చైర్మన్ రెవరెండ్ సునీల్‌కుమార్ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని స్థానిక ఇమ్మానుయేలు చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.